



Truth of News

PRGI Reg No: APTEL/26/A4784

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్








అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 35 | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## కార్గో నౌకలో అగ్నిప్రమాదం
# చైనాలో 25 మంది మృతి

- ఘటనాస్థలంలో సహాయక చర్యలు ముమ్మరం చేయాలి : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాలు

2లో




# బ్రిక్స్ వైపే అందరి చూపు

- సదస్సుకు సిద్ధమైన ఢిల్లీ
- నేడు రష్యా, ఇరాన్ అధ్యక్షుల రాక
- మోడీతో ప్రత్యేక భేటీ




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

భారత్ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ సమావేశాల వేదికకు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఈనెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాలు, ఆహ్వానిత దేశాల ప్రతినిధులూ పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ప్రపంచ ఆర్థిక వృద్ధిని

- మిగతా 2లో..



## రేపు భారత్‌కు
# జిన్‌పింగ్ రాక

- మోడీతో ద్వైపాక్షిక భేటీకి అవకాశం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

బ్రిక్స్ సదస్సులో పాల్గనేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శనివారం న్యూఢిల్లీ చేరుకుంటారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. 2020లో గాల్వన్ లోయలో ఘర్షణలు జరిగిన అనంతరం మోడీ, జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగడం ఇదే మొదటిసారి. రెండు దేశాల మధ్య ఇటీవలి కాలంలో మెరుగవుతున్న ద్వైపాక్షిక సంబంధా లను మరింత

- మిగతా 2లో..

## రివ్యూలు కాదు..
# రిజల్ట్స్ కావాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- రివ్యూలతో కాలయాపన వద్దు, ఫలితాలు చూపాలని కలెక్టర్లకు సీఎం స్పష్టీరణ
- ప్రో-యాక్టివ్‌గా పనిచేస్తూ, అభివృద్ధిలో జిల్లాలు, శాఖలు పోటీ పడాలని దిశానిర్దేశం
- 'సీఈఓ' గుర్తింపు కన్నా 'వాటర్ మ్యాన్' అని పిలిపించుకోవడమే తనకు సంతృప్తి అన్న సీఎం
- నకిలీ ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని, వాస్తవ నివేదికలు ఇవ్వాలని అధికారులకు సూచన
- 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'తో స్వర్ణాంధ్ర సాధన సాధ్యమన్న చంద్రబాబు




అమరావతి - సూర్య వాస్తవం

"గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్'.. ఇదే మన మిషన్**

ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి,

- మిగతా 2లో..



## కాంగ్రెస్ ప్రభుత్వం
# సరైన మార్గంలో ఉంది

- ఎన్నికల హామీలను నెరవేరుస్తోంది
- కరువు నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి: సిద్ధరామయ్య
- మనం సరైన దిశలో పయనిస్తున్నామో లేదో సమీక్షించుకోవడానికి ఇది ఒక అవకాశం, బాధ్యత అని సిద్ధరామయ్య అన్నారు.

బెంగళూరు- సూర్య వాస్తవం

కాంగ్రెస్ ప్రభుత్వం "సరైన దిశలో" పయనిస్తోందని, డి.కె. శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడం, ఐదు హామీ పథకాలను కొనసాగించడం, కరువు పరిస్థితిని ఎదుర్కోవడంపై దృష్టి పెట్టాలని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ 100 రోజుల సరఫరా కార్యక్రమంలో సిద్ధరామయ్య మాట్లాడుతూ, ఈ సందర్భాన్ని కేవలం ఒక వేడుకగా మాత్రమే చూడకూడదని, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం

- మిగతా 2లో..



## తమిళనాడులో
# రాష్ట్ర పార్టీగా టీవీకే..

- విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు
- తమిళగ వెట్రి కళగంకు రాష్ట్ర పార్టీ హోదా కల్పించిన ఈసీ
- విజయ్ పార్టీకి శాశ్వత గుర్తుగా 'విజిల్' కేటాయింపు
- 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు గెలిచిన టీవీకే
- తొలి ఎన్నికల్లోనే 34.92 శాతం ఓట్లు సాధించిన పార్టీ
- తమిళనాడులో ఏడో రాష్ట్ర పార్టీగా అవతరించిన టీవీకే

2లో

## ప్రతిపక్షాల కుట్రలను
# బలంగా తిప్పికొట్టాలి

- సభ జరిగే ప్రతీ రోజు విధిగా హాజరుకావాలని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం
- ఓటర్ల జాబితా, కులగణనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- ప్రభుత్వ వెయ్యి రోజుల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ - సూర్య వాస్తవం

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతిపక్షాల కుట్రలను ఎప్పకటికప్పుడు దీటుగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తుంటే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశమై సభను సజావుగా జరగకుండా కుట్ర పన్నిందని సీఎం తీవ్రంగా ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయినా అహంకారం వీడకుండా వ్యవహరిస్తున్నారని నిప్పులు చెరిగారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే ప్రతీ రోజు

- మిగతా 2లో..



## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన
# ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా: జగన్

- మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయన్న జగన్
- స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారని ప్రశ్న
- జూడో ఆట కింద 39 మందికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శ

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## కార్గో నౌకలో అగ్నిప్రమాదం
# చైనాలో 25 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)
చైనాలోని చింగ్డావో బెహై షిప్‌యార్డ్‌లో ఓ నౌకలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 25 మంది మృతి చెందారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ప్రయాణిస్తున్న 'ఓషన్ మెలోడీ' అనే సరకు రవాణా నౌక.. మరమ్మతుల కోసం చింగ్డావో బెహై షిప్‌యార్డ్‌లో ఆగింది. అక్కడే నౌకలో మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థ లంలో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అగ్నిప్రమాదానికి దారితీసిన కారణాలపై త్వరితగతిన దర్యాప్తు జరపాలని, బాధితులకు సాయం అందించాలని సూచించారు. మరోవైపు, ఈ నౌకలో చిక్కుకున్న సిబ్బందిని రక్షించడం, గాయపడిన వారికి చికిత్స అందించడంపై దృష్టి పెట్టాలని చైనా ప్రధాని లీ కియాంగ్ అత్యవసర బృందాలను ఆదేశించారు. చింగ్డావో బెహై అనేది 'చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్' ఆధ్వర్యం లోని ఒక ప్రధాన షిప్‌యార్డ్. ఇక్కడ వాణిజ్య నౌకల నిర్మాణం, మరమ్మ తులు వంటివి చేస్తుంటారు. తీరప్రాం తం వెంబడి 9 కిలోమీటర్ల మేర 815 ఎకరాల విస్తీర్ణంలో ఇది విస్తరించి ఉంది.

## రేపు భారత్‌కు
# జిన్‌పింగ్ రాక

(మొదటిపేజీ తరువాయి)
బలోపేతం చేసుకోవడానికి ఈ సమావేశం దోహదపడుతుందని పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. శని, ఆది వారాలలో న్యూఢిల్లీలో బ్రిక్స్ నేతల శిఖరాగ్ర సమావేశం జరుగుతుంది. శనివారం మధ్యాహ్నం న్యూఢిల్లీ చేరుకునే జిన్‌పింగ్ అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు మోడీతో ద్వైపాక్షిక సమావేశం జరిపే అవకాశం ఉంది. గడచిన ఏడు సంవత్సరాల కాలంలో జిన్‌సింగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. కాగా ప్రతిపాదిత ద్వైపాక్షిక సమావేశంపై ఇరు దేశాలు ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు జరిగినప్పుడు ఇరువురు నేతలు కరచాలనం చేసుకొని వేదికను పంచుకు న్నారు. అయితే అధికారికంగా ఇరువురు నేతల మధ్య చర్చలేవీ జరగలేదు. జిన్‌పింగ్ భారత పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ బీజింగ్ వెళ్లి చైనా నేతలు, అధికారులతో ఉన్నత స్థాయి చర్చలు జరిపారు.

## తమిళనాడులో
# రాష్ట్ర పార్టీగా టీవీకే..

చెన్నై- సూర్య వాస్తవం
ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన
# ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా: జగన్

- మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయన్న జగన్
- స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారని ప్రశ్న
- జూడో ఆట కింద 39 మందికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శ

అమరావతి - సూర్య వాస్తవం
ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్‌సీఈఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు. జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

# బ్రిక్స్ వైపే అందరి చూపు

(మొదటిపేజీ తరువాయి)
మరింత సమ్మిళితంగా మార్చేందుకు అవసరమైన సహకారం, ఆవిష్కరణలు, స్థిరత్వం, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో 18వ బ్రిక్స్ లీడర్స్ సమ్మిట్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ , ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ శుక్రవారమే న్యూఢిల్లీకి చేరుకుంటారని భావిస్తున్నారు. వీరిద్దరూ ప్రధానమంత్రి మోడీతో భేటీ కానున్నారు.

బ్రిక్స్ అనేది... గ్లోబల్ సౌత్ దేశాల మధ్య రాజకీయ, దౌత్య, ఆర్థిక సహకారం కోసం ఏర్పడిన అంతర్జాతీయ సమన్వయ వేదిక. దీనికి ప్రత్యేక రాజ్యాంగ ఒప్పందం, సొంత బడ్జెట్ లేదా శాశ్వత సెక్రటేరియట్ లేవు. బ్రిక్స్ సహకారం ప్రధానంగా మూడు విభాగాలు...రాజకీయ, భద్రతా సహకారం, ఆర్థిక రంగ సహకారం, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాల చుట్టూ కొనసాగుతుంది. ప్రస్తుతం బ్రిక్స్‌లో 11 పూర్తి సభ్య దేశాలు ఉన్నాయి.

**నాలుగోసారి బ్రిక్స్ అధ్యక్షత బాధ్యతలు చేపట్టనున్న భారత్**

2026 జనవరి 1 నుంచి భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టింది. అయితే భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021 సంవత్సరాల్లోనూ భారత్ ఈ బాధ్యతలను నిర్వహించింది. అంతేకాకుండా 2026వ సంవత్సరం బ్రిక్స్ ఏర్పాటై 20 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది

**2024 కజాన్ సదస్సులో బ్రిక్స్‌లో ?పార్ట్నర్ కంట్రీ కేటగిరీ ఏర్పాటు**

2024 కజాన్ సదస్సులో బ్రిక్స్‌లో పార్ట్నర్ కంట్రీ కేటగిరీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ విభాగంలో బెలారస్, బొలీవియా, క్యూబా, కజకిస్తాన్, మలేషియా, నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్తాన్, వియత్నాం ఉన్నాయి. భాగస్వామ్య దేశాలను సాధారణంగా నేతల సదస్సుకు ఆహ్వానిస్తారు. సభ్య దేశాల ఏకాభిప్రాయం ఉన్న సందర్భాల్లో ఇతర బ్రిక్స్ సమావేశాల్లోనూ వీరు పాల్గొనే అవకాశం ఉంటుంది.

**విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు**

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో భారత ప్రభుత్వం, భారత భద్రతా బలగాలు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సదస్సు సమయంలో అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఢిల్లీ విమానాశ్రయ నిర్వాహక సంస్థ పలు కఠినమైన చర్యలను అమలు చేస్తోంది. తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 500 సీసీటీవీ కెమెరాల సహాయంతో, భద్రతా ఏర్పాట్లను సీసీటీవీ కంట్రోల్ రూమ్ పర్యవేక్షిస్తుంది. ఈ కంట్రోల్ రూమ్ పరిధిలో న్యూఢిల్లీ జిల్లాలోని కీలకమైన రహదారులలో సగం భాగం, అలాగే విదేశీ అతిథులు బస చేయనున్న ఆబ్రే హోటల్ , తాజ్ మాన్ సింగ్ హోటల్ వంటి ప్రాంతాలు ఉంటాయి.అదే విధంగా సమగ్ర భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ, ఇతర ఏజెన్సీలకు చెందిన సుమారు 7,000 మంది సిబ్బందిని మోహరించారు. అలాగే వివిధ ప్రాంతాలలో ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎస్పీజీ సిబ్బందితో కూడిన బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

**బ్రిక్స్ సదస్సు ప్రధాన ఎజెండా...**

గ్లోబల్ సౌత్: అంతర్జాతీయ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను, ప్రాతినిధ్యాన్ని బలంగా వినిపించడంపై భారత్ ప్రధానంగా దృష్టి సారించనుంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ : డిజిటల్ చెల్లింపులు, డిజిటల్ సేవల రంగంలో భారత ప్రభుత్వం సాధించిన విజయాలను, జ్ఞానాన్ని ఇతర బ్రిక్స్ దేశాలతో పంచుకోవడం. వాతావరణ మార్పులు, ఇంధన పరివర్తన: పునరుత్పాదక శక్తి, ఇంధన భద్రత, స్థిరమైన సాంకేతికతలపై సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం. మల్టీలేటరల్ సంస్థల సంస్కరణలు: ఐక్యరాజ్యసమితి, ఐఎంఎఫ్ వంటి ప్రపంచ ఆర్థిక, పాలనా సంస్థల్లో వర్ధమాన దేశాలకు సరైన ప్రాతినిధ్యం దక్కేలా సంస్కరణలు తీసుకురావడంపై చర్చలు.

## రివ్యూలు కాదు..
# రిజల్ట్స్ కావాలి

(మొదటిపేజీ తరువాయి)
నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

**'సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందం**

ఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. "గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు.

**టీమ్ విజయంతోనే అభివృద్ధి సాధ్యం**

గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్య మైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు.

**అవకాశాలను అందిపుచ్చుకుని, నకిలీ ప్రచారాలను తిప్పికొట్టాలి**

ప్రతి జిల్లాలో 25 ప్రధాన ప్రాజెక్టులను, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటిని పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. జిల్లాలో 'గ్రోత్ ఇంజన్లను' గుర్తించి సంపద సృష్టించాలని సూచించారు. "టెక్నాలజీని అందిపుచ్చుకుని 'డీప్ టెక్ గవర్నెన్స్' ద్వారా నిర్ణయాల్లో వేగం, సేవల్లో నాణ్యత పెంచాలి. కొందరు పనిగట్టుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. వాటిని వెంటనే గుర్తించి, వాస్తవాలతో తిప్పికొట్టాలి. డీఎస్సీ-2025 విషయంలో ఇద్దరు మహిళా అధికారులు సమర్థంగా స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచారు.

వారిని అభినందిస్తున్నాను" అని సీఎం అన్నారు. గత ప్రభుత్వ హయాంలోని 'జే బ్రాండ్' మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని, తాము కల్తీ బ్రాండ్లను రద్దు చేసి పారదర్శకత తీసుకొచ్చామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, నీటి భద్రత ఒక సవాలుగా మారిందని, అయినా తాగునీటి సరఫరాలో ఎలాంటి రాజీ పడబోమని హామీ ఇచ్చారు. సంక్షోభ సమయాల్లోనే కలెక్టర్ల నాయకత్వ పటిమ బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యమని, ప్రస్తుతం 13.44 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధిరేటును 15 శాతానికి తీసుకెళ్దామని ఆయన అధికారులలో స్ఫూర్తి నింపారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల కుట్రలను
# బలంగా తిప్పికొట్టాలి

(మొదటిపేజీ తరువాయి)
సభ్యులంతా విధిగా సభలో ఉండాలని, చర్చల్లో క్రియాశీలకంగా పాల్గొనాలని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన హోదాను, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించడం కష్టమని హితవు పలికారు. దేశంలో ఓట్ల తొలగింపునకు సంబంధించి జరుగుతున్న పరిణామాలు, ఎస్ఐఆర్ అంశాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని, ఓటు హక్కును పరిరక్షించే బాధ్యత నాయకులపై ఉందని సూచించారు. అలాగే తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు శ్రీ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం శ్రీ మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం సరైన మార్గంలో ఉంది

(మొదటిపేజీ తరువాయి)
నెరవేరుస్తోందా లేదా అని పరిశీలించుకోవడానికి ఒక అవకాశంగా పరిగణించాలని అన్నారు. మనం సరైన దిశలో పయనిస్తున్నామా లేదా అని గమనించుకోవడానికి ఇది ఒక అవకాశం మరియు బాధ్యత అని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారని, అభివృద్ధి పనులకు నిధులు అందకుండా చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు విమర్శించినప్పటికీ, గృహజ్యోతి, గృహలక్ష్మి, అన్నభాగ్య, శక్తి, యువ నిధి అనే ఐదు హామీ పథకాలను విజయవంతంగా అమలు చేశామని ఆయన అన్నారు. ఈ పథకాలపై ఏటా సుమారు రూ. 52,000 కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ హామీ పథకాల వల్ల అన్ని వర్గాల పేద ప్రజలు లబ్ధి పొందారని ఆయన అన్నారు. అభివృద్ధి పనులకు నిరంతరంగా నిధులు అందించడమే కాకుండా, కాంగ్రెస్ తన మేని ఫెస్టోలోని అనేక ఇతర హామీలను కూడా నెరవేర్చిందని ఆయన నొక్కి చెప్పారు "మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ ఒక్క సంవత్సరంలోనే అమలు చేయాల్సిన అవసరం లేదు. ఐదేళ్ల కాలంలో అన్ని హామీలను నెరవేర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి," అని ఆయన అన్నారు. 2013లో తన నాయ కత్వంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన 165 హామీలలో 158ని నెరవేర్చిందని ఆయన ఉదహరించారు. రాజ్యాంగం ఆశించిన విధంగా అసమానతలను తగ్గించి, సమాన సమాజాన్ని నిర్మించడానికి హామీ పథకాలు అత్యవసరం కాబట్టి ప్రభుత్వం వాటిని కొనసాగించాలని సిద్ధరామయ్య అన్నారు. సమాన సమాజాన్ని నిర్మించడమే రాజ్యాంగ ఆదర్శం. అణచివేత, దోపిడీలను అనుమతిస్తే, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించినప్పుడు మాత్రమే వాటిని ఆపగలమని ఆయన అభిప్రాయపడ్డారు. శివకుమార్ మరియు ఆయన మంత్రివర్గాన్ని అభినందిస్తూ, సిద్ధరామయ్య ఇలా అన్నారు, "ముఖ్యమంత్రి 'గ్యారెంటీ' పథకాలను కొనసాగిస్తూ, కొత్త కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం సరైన దిశలో పయనిస్తోందని నేను భావిస్తున్నాను." తన పదవీకాలంలో మిగిలిన 18 నెలల్లో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కరువు వంటి తక్షణ సమస్యలను పరిష్కరించకుండా, మాజీ మంత్రి బి. నాగేంద్ర రాజీనామాను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ, ఆయన బీజేపీ పాదయాత్రపై విమర్శలు గుప్పించారు. "పది రోజుల పాటు అసెంబ్లీ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ఈ రోజు రాష్ట్రంలో తీవ్ర కరువు ఉంది. వారు కరువు గురించి చర్చించలేదు. దానికి బదులుగా, నాగేంద్ర రాజీనామా కోరుతూ పాదయాత్ర చేస్తున్నారు." పాదయాత్రను ఒక "జిమ్మిక్కు" అని అభివర్ణించిన సిద్ధరామయ్య, దీనిపై ముఖ్యమంత్రి గానీ, ప్రభుత్వం గానీ స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కరువు సమస్యపై, పూర్తిగా కేంద్ర సహాయంపై ఆధారపడకుండా, అర్హత ఉన్న మరిన్ని తాలూకాలను తక్షణమే కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించాలని సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే 101 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం సహాయం

# సంపాదకీయం

## షెల్ పార్టీల దందా




షెల్ కంపెనీల గురించి చాలా మంది వింటారు. కానీ షెల్ రాజకీయ పార్టీలు కూడా ఉంటాయి. సేఫ్ గా అక్రమ సొమ్మును చెలామణిలోకి తెచ్చుకోవడానికి ఈ పార్టీలు ఉపయోగపడతాయి. పార్టీలు నమోదవుతాయి. ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఉండరు, ప్రజల్లో ఉనికి ఉండదు, ఆఖరుకు కార్యాలయాలకు తాళాలు వేసి ఉంటాయి.. కానీ వేల కోట్ల రూపాయల చందాలు మాత్రం ఈ పార్టీలకు అందుతూ ఉంటాయి. షెల్ రాజకీయ పార్టీలు అంటే కేవలం కాగితాల మీద మాత్రమే ఉంటూ, ఎలాంటి నిజమైన రాజకీయ లేదా ఎన్నికల కార్యకలాపాలు నిర్వహించకుండా, ప్రధానంగా పన్ను మినహాయింపులు, మనీలాండరింగ్ కోసం ఉపయోగపడే నకిలీ లేదా నిష్క్రియ రాజకీయ పార్టీలు2023-24 ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే గుజరాత్‌కు చెందిన ఆరు గుర్తింపు లేని రాజకీయ పార్టీలు ఏకంగా రూ. 1,700 కోట్ల విరాళాలు లభించాయి. దేశంలోని ఐదు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, ఆప్, బిఎస్పి, సిపిఎం, ఎన్పీపీలన్నీ కలిసి సేకరించిన మొత్తం విరాళాలు రూ. 1,480 కోట్లు కన్నా ఈ ఆరు అనామక పార్టీల నిధులే ఎక్కువ. సాధారణంగా షెల్ కంపెనీలను పెట్టి నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునే అక్రమార్కులు, ఇప్పుడు ఇన్కమ్ టాక్స్ మినహాయింపులు లభించే రాజకీయ పార్టీలను షెల్ పార్టీలు గా మార్చేసి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు.

ఇందులో అత్యంత ఆందోళనకరమైన విషయం ఏంటంటే.. ఏకంగా రూ. 620 కోట్లకు పైగా విరాళాలు పొందిన ఆమ్ జనమత్ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసింది కేవలం ఒక్కటంటే ఒక్క స్థానంలో మాత్రమే! అటు నాలుగైదు పార్టీల చిరునామాలు అహ్మదాబాద్‌లోని నరోడా అనే ఒకే ఒక్క ప్రాంతంలో కేంద్రీకృతమై ఉండటం, ఆఫీసులన్నీ ఖాళీగా ఉండటం చూస్తుంటే ఇవి పక్కా వ్యూహంతో నడుస్తున్న హవాలా ముఠాలనే అనుమానాలు బలపడుతున్నాయి. ప్రజారోగ్యం, ప్రజా సంక్షేమం పేరుతో వందల కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, దానికి సంబంధించిన ఎటువంటి బ్యాంక్ స్టేట్‌మెంట్లు లేదా అధికారిక ఆధారాలు లేకపోవడం ఈ షెల్ నెట్‌వర్క్ అసలు రంగును బయటపెడుతోంది.గతంలో 2019 నుండి 2024 మధ్య కాలంలో గుజరాత్‌కు చెందిన 10 అనామక పార్టీలు రూ. 4,300 కోట్లు సేకరించినట్లుగా నివేదికలు ఉన్నాయి. అంటే దేశీయంగా పన్ను ఎగవేతదారులు, కార్పొరేట్ దందాలు నడిపే ముఠాలు , నల్లధన తిమింగలాలు తమ అక్రమ సంపాదనను సురక్షితంగా రౌండ్-ట్రిప్పింగ్ చేయడానికి, ఎన్నికల నిధుల పేరుతో చట్టపరమైన రక్షణ పొందడానికి ఈ షెల్ పొలిటికల్ పార్టీలను ఒక లాండరింగ్ ఏజెంట్లుగా వాడుకుంటున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమైన ఎన్నికల వ్యవస్థను, పన్ను మినహాయింపు చట్టాలను ఆసరాగా చేసుకుని దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులనే తొలుస్తున్న ఈ వ్యవహారం ముమ్మాటికీ ఆర్థిక నేరమే.దేశంలో ఉన్న 2,700 పైచిలుకు పార్టీల కార్యకలాపాలపై కేంద్ర ఎన్నికల కమిషన్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఆదాయపు పన్ను శాఖలు తక్షణమే ఉమ్మడి విచారణ జరపాల్సిన అవసరం ఉంది. సుప్రీం కోర్టుతీర్పురాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడానికి షెల్ కంపెనీలను ఉపయోగించే అవకాశంపై భారత ఎన్నికల సంఘం వ్యక్తం చేసిన ఆందోళనలను కారణంగా చూపుతూ, ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేశారు.2017లో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా షెల్ కంపెనీలుగా పేర్కొన్న 300కు పైగా సంస్థల జాబితాలో ఉన్న కనీసం నాలుగు సంస్థలు, 2013-14 మరియు 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య బీజేపీకి నేరుగా మొత్తం రూ. 4.94 కోట్లు విరాళంగా ఇచ్చాయని న్యూస్‌లాండ్రీ ఇప్పుడు కనుగొంది.వాటిలో రెండు షెల్ సంస్థలుగా జాబితా చేయబడక ముందే బీజేపీకి విరాళాలు ఇవ్వగా, వ్యాపార ఆంక్షలు విధించబడిన సెబీ షెల్ కంపెనీల జాబితా నుండి ఆ నాలుగు సంస్థలను ఇంకా తొలగించలేదు.దాదాపు ఒక నెల తర్వాతనివేదించబడిందిగత ఐదు ఆర్థిక సంవత్సరాలలో 30 కంపెనీలు బీజేపీకి రూ. 335 కోట్ల విరాళాలు ఇవ్వడానికి, కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలకు మధ్య సంబంధం ఉన్నట్లు కనిపించినప్పటికీ, ఇప్పుడు మేము మరో 11 కంపెనీలను కనుగొన్నాము ? ఇవి 2016-17 నుండి 2022-23 వరకు బీజేపీకి రూ. 62.27 కోట్లు విరాళాలు ఇచ్చి, అదే కాలంలో కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలను ఎదుర్కొన్నాయి.నిధుల మూలాలను శోధించకుండా, క్షేత్రస్థాయిలో ఉనికి లేని ఇటువంటి బోగస్ పార్టీల గుర్తింపును రద్దు చేయడంతో పాటు, రాజకీయ నిధుల పేరుతో సాగుతున్న ఈ శ్వేతపత్ర ఆర్థిక ఉగ్రవాదానికి చట్టపరమైన కఠిన చర్యల ద్వారా శాశ్వత ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందన్న అభిప్రాయం వినిపిస్తోంది. దాతలు ఈ పార్టీలకు కోట్ల రూపాయల విరాళాలు ఇచ్చినట్లు చూపించి ఐటీ మినహాయింపు పొందుతారు. ఆ తర్వాత సదరు పార్టీ నిర్వాహకులు కొంత శాతం 'సర్వీస్ చార్జ్' (కమిషన్) మినహాయించుకుని, మిగిలిన నగదును దాతలకు తిరిగి ఇచ్చేస్తారని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు

# బ్రిక్స్‌తో భారత వాణిజ్య లోటు మూడింతలు

**- దిగుమతుల్లో 42 శాతం వాటా..**
**- ఎగుమతులు 22 శాతమే**




**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

బ్రిక్స్ కూటమి దేశాలతో భారత వాణిజ్య సంబంధాలు వేగంగా విస్తరిస్తున్న ప్పటికీ.. అంతకంటే దిగుమతులు ఎక్కువగా పెరిగిపోతున్నాయి. ఇటీవల ఎగుమతులు--దిగుమతుల మధ్య భారీ అంతరం మరింత పెరుగుతోంది. భారత్ మొత్తం దిగుమతుల్లో బ్రిక్స్ దేశాల వాటా 42 శాతానికి చేరగా, ఎగుమతుల్లో వాటా కేవలం 22 శాతంగా ఉంది. దీంతో ఈ కూటమితో భారత్ వాణిజ్య లోటు భారీగా పెరిగింది. 'ది వైర్' రిపోర్ట్ ప్రకా రం.. 2021 నుంచి 2026 మధ్య బ్రిక్స్ దేశాల తో భారత్ మొత్తం వస్తు వాణిజ్యం 203.1 బిలియన్ డాలర్ల నుంచి 417.5 బిలియన్ డాల ర్లకు పెరిగింది. దాదాపు రెట్టింపు అయ్యింది.

**దిగుమతులే వేగంగా...**

ఈ కాలంలో బ్రిక్స్ దేశాలకు భారత ఎగుమతులు 64.3 బిలియన్ డాలర్ల నుంచి 95.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అంటే 48.8 శాతం పెరిగాయి. అదే సమయంలో దిగుమతులు మాత్రం ఏకంగా 131.8 శాతం ఎగిసి 138.8 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 321.8 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య లోటు 74.5 బిలియన్ డాలర్ల నుంచి 226.1 బిలియన్ డాలర్లకు పెరిగింది. దాదాపు మూడు రెట్లకు పైగా వాణిజ్యలోటు పెరిగినట్టయింది.

**చైనా, రష్యా నుంచే అధిక దిగుమతులు**

బ్రిక్స్ దేశాల నుంచి భారత దిగుమతుల్లో చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. చైనా నుంచి దిగుమతులు 65.2 బిలియన్ డాలర్ల నుంచి 131.6 బిలియన్ డాలర్లకు చేరాయి. భారత బ్రిక్స్ దిగుమతుల్లో చైనా వాటా దాదాపు 41 శాతంగా ఉంది. యుఎఇ నుంచి 63.9 బిలియన్ డాలర్లు, రష్యా నుంచి 55.4 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు దిగుమతయ్యాయి. రష్యా నుంచి దిగుమతులు 5.5 బిలియన్ డాలర్ల నుంచి 55.4 బిలియన్ డాలర్లకు పెరగడానికి ప్రధానంగా ఇంధన కొనుగోళ్లే కారణం. ఈ మూడు దేశాల నుంచే బ్రిక్స్ కూటమి నుంచి భారత్ చేసుకునే దిగుమతుల్లో దాదాపు 84 శాతం ఉన్నాయి.

**యుఎఇకి అత్యధిక ఎగుమతులు**

ఎగుమతుల పరంగా చూస్తే యుఎఇ భారత్‌కు అతిపెద్ద బ్రిక్స్ మార్కెట్‌గా ఉంది. 2026 ఆర్థిక సంవత్సరంలో యుఎఇకి భారత్ ఎగుమతులు 37.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. చైనాకు 19.5 బిలియన్ డాలర్లు, సౌదీ అరేబియాకు 10.3 బిలియన్ డాలర్లు ఎగుమతయ్యాయి. బ్రెజిల్, దక్షిణాఫ్రికాకు 7 బిలియన్ డాలర్లు చొప్పున, రష్యా, ఇండోనేషియాకు 4.5 బిలియన్ డాలర్ల చొప్పున ఎగుమతులు జరిగాయి. అయితే ఇండోనేషియా, ఇరాన్, ఇథియోపియాలకు భారత్ ఎగుమతులు తగ్గాయి.

**చైనాదే ఆధిపత్యం..**

బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత వస్తు వాణిజ్యం కూడా భారీ స్థాయిలో ఉంది. కూటమి దేశాల మధ్య సుమారు 1.1 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులు, 1.4 ట్రిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతున్నాయి. ఇందు లో చైనా కీలక పాత్ర పోషిస్తోంది. ఇతర బ్రిక్స్ దేశాలకు చైనా 550.8 బిలియన్ డాలర్ల విలువై న వస్తువులు ఎగుమతి చేస్తుండగా.. వాటి నుంచి 464.9 బిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకుంటోంది. బ్రిక్స్ సభ్య దేశాలన్నింటిలో భారత్‌కే అత్యధికంగా 226.1 బిలియన్ డాల ర్ల వాణిజ్య లోటు ఉండటం ఆందోళనకరం.

**దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి**

యంత్రాలు, పారిశ్రామిక ముడిసరు కులు, ఇంధనం వంటి కీలక అవసరాలకు బ్రిక్స్ దేశాలపై భారత్ ఆధారపడు తున్నప్పటికీ.. అదే స్థాయిలో ఎగుమతులను పెంచుకోలేకపోతోంది.

ముఖ్యంగా చైనా, రష్యా, ఇండోనేషియా వంటి మార్కెట్లలో భారత ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యం పెంచడం, అధిక విలువ కలిగిన వస్తువుల ఎగుమతులను విస్తరించడం, కొన్ని దేశాలపై దిగుమతుల ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా ఈ వాణిజ్యలోటు అసమతుల్యతను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే బ్రిక్స్ కూటమితో భారత్ వాణిజ్య లోటు మరింత విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# తాగునీటి కోసం తెలుగుగంగకు నీరు విడుదల చేయాలి..!

**- అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి**
**- రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి**



**మైదుకూరు - సూర్య వాస్తవం:** మైదుకూరు నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెలుగోడు నుంచి తెలుగు గంగకు సంబంధించిన ఎస్ఆర్1, ఎస్ఆర్ 2 ప్రాజెక్టులకు వెంటనే నీటిని విడుదల చేయాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, అఖిల భారత రెడ్డి సంఘం రైతుభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముంచాల సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వారు దువ్వూరులో మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గ ప్రజలకు తాగునీటి కోసం నీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దువ్వూరు మండల పరిధిలోని చల్లబసాయపల్లె గ్రామం సమీపంలోని తెలుగుగంగ ఎస్ఆర్-1 ప్రాజెక్టు, మైదుకూరు మండల పరిధిలోని గంజికుంట- ఏకర్లపాలెం ప్రాంతం సమీపంలోని ఎస్ఆర్-2 ప్రాజెక్టులకు వెలుగోడు నుంచి నీటిని విడుదల చేసి జిల్లా ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 7వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్ ద్వారా కడప జిల్లాకు తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీల నీరు, అలాగే గాలేరు-నగరి, సుజల-స్రవంతి ద్వారా 13 టీఎంసీల నీరు వెలుగోడు నుంచి విడుదల చేస్తున్నట్లు ప్రకటించిందని తెలిపారు. అయితే వైస్సార్ కడప జిల్లాలోని తెలుగు గంగ ప్రాజెక్టులకు ఇప్పటివరకు చుక్క నీరు కూడా చేరలేదని వారు ఆరోపించారు. ప్రాజెక్టుల్లో ఇప్పటికే ఉన్న నీటిని వాటికి అనుబంధంగా ఉన్న చెరువులకు విడుదల చేసి నింపడం జరుగుతోందని, దీంతో ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోయి అవి ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నియోజకవర్గ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వెలుగోడు నుంచి నీటిని విడుదల చేసి తెలుగు గంగ ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 ప్రాజెక్టులను నీటితో నింపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతాల వరకు నంద్యాల, ఆళ్లగడ్డ శాసనసభ్యులు, అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు. ఇప్పటికే నంద్యాల, ఆళ్లగడ్డ పరిధిలోని చెరువులు, కుంటలు నిండిపోయాయి. మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ వెంటనే తెలుగుగంగ ఉన్నతాధికారులతో మాట్లాడి వైయస్సార్ కడప జిల్లాలోని తెలుగు గంగ ప్రాజెక్టులకు నీరు నింపాలని వారు తెలిపారు. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించకపోతే అఖిల భారత రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, రైతులు, ప్రజలతో కలిసి సమస్య పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు.

# చంద్రబాబు దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు..

**- ఎమ్మెల్యే దగ్గుపాటి...!**
**- అర్బన్ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరింత కాలం ప్రజలకు సేవలందించేలా ఆయనకు ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, ఆశీస్సులు ప్రసాదించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉరవకొండ వద్ద ఘోర ప్రమాదం

### - ముగ్గురి మృతి



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఉరవకొండ శివారులోని మైక్రో స్టేషన్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వజ్రకరూర్కు చెందిన కనేకల్ జైనుల్లా, మహబూబ్ బాషా, మహమ్మద్ రఫీ అక్కడికక్కడే మృతి చెందారు. కోర్టు పనిమీద ఉరవకొండకు వెళ్లిన వారు తిరిగి వజ్రకరూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ వద్ద రోడ్డు మధ్యలో వంగిన ఇనుప చువ్వలు...!

- రాత్రివేళ విద్యుత్ దీపాలు లేక వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- వాహనదారులకు ఇనుప చువ్వల పోటు
- తక్షణమే తొలగించాలని స్థానికుల విజ్ఞప్తి



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** కలెక్టరేట్ నుంచి ఎస్కేయూ వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట ప్రమాదకర పరిస్థితి నెలకొంది. రోడ్డు మధ్యలోని డివైడర్పై ఏర్పాటు చేసిన బారికేడ్ను పదిరోజుల క్రితం ఓ కారు బలంగా ఢీకొట్టడంతో ఇనుప చువ్వలు పూర్తిగా వంగిపోయాయి. ప్రస్తుతం అవి రోడ్డులో కొంత భాగం వరకు ముందుకు వచ్చి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి.ముఖ్యంగా ఈ ప్రాంతంలో రాత్రివేళ సరైన విద్యుత్ దీపాలు లేకపోవడంతో వంగిపోయిన బారికేడ్ వాహనదారులకు స్పష్టంగా కనిపించకపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేగంగా వచ్చే వాహనాలు బారికేడ్ను ఢీకొంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.ఇప్పటికే ప్రమాదానికి గురైన బారికేడ్ను తొలగించకుండా వదిలేయడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డువైపు వంగి ఉన్న ఇనుప చువ్వలను తొలగించి, రాత్రివేళ సరైన వెలుతురు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు

## కరువు ముంగిట...

## నీటిలో వినాయక నిమజ్జనమా?

- అడుగంటిన జలాశయాలు...

ఆర్భాటంగా వినాయక నిమజ్జనాలు

- డా. ముచ్చుకోట సురేష్ బాబు




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** వర్షాభావ పరిస్థితులు, తగ్గుతున్న జలాశయ నీటిమట్టాలు, భవిష్యత్‌లో తలెత్తే నీటి కొరతపై ఇప్పటి నుంచే అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని ఈ కథనం సూచిస్తోంది. ఒకవైపు తాగునీటి అవసరాలకే ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తుండగా, మరోవైపు గణేష్ ఉత్సవాల సందర్భంగా భారీ విగ్రహాల నిమజ్జనం ద్వారా నీటి వనరులు కలుషితం అయ్యే అంశంపై సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొంటోంది. కరువు అనేది కేవలం తాగునీటి సమస్యకు మాత్రమే పరిమితం కాదని, వ్యవసాయం, పశుపోషణ, ఆహార భద్రత, ఉపాధి, ప్రజారోగ్యంపై కూడా ప్రభావం చూపే విస్తృత సంక్షోభమని కథనం వివరిస్తోంది. అందువల్ల ప్రభుత్వాలు కరువు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు ప్రణాళికలతో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తోంది. అదే సమయంలో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి తాగునీటి వనరులు, చెరువులు, రిజర్వాయర్లు కలుషితం కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరుతోంది.

# గుత్తి కోటకు అరుదైన గౌరవం...!

- స్మారక తపాలా బిళ్ల విడుదలకు కీలక ముందడుగు
- కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి ఆమోదం కోసం ఎంపీ ప్రతిపాదన
- జిల్లా చారిత్రక వారసత్వాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయడమే లక్ష్యం
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రతిపాదనపై కేంద్ర తపాలా శాఖ పరిశీలన



**అనంతపురం - సూర్య వాస్తవం :** జిల్లాకు చెందిన చారిత్రక వారసత్వ సంపద గుత్తి కోటకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకువచ్చే దిశగా కీలక ముందడుగు పడింది. గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి చేసిన ప్రతిపాదన కేంద్ర తపాలా శాఖలో కీలక దశకు చేరుకుంది.గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, తపాలా శాఖ పరిశీలన జరిపి, స్మారక తపాలా బిళ్ల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి ఆమోదం కోసం సమర్పించింది.

**చారిత్రక ప్రాధాన్యతకు గుర్తింపు**

తపాలా శాఖ అధికారిక నోట్లో గుత్తి కోట రాష్ట్రంలోని అతిపెద్ద కోటల్లో ఒకటిగా, 1921 నుంచి భారత పురావస్తు సర్వే శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర రక్షిత స్మారక చిహ్నంగా ఉన్నట్లు పేర్కొంది. కోటలోని బహుళస్థాయి ప్రాకారాలు, బురుజులు, పురాతన మార్గాలు, నీటి నిల్వలు, చారిత్రక శ్రీ రఘునాథస్వామి ఆలయం వంటి నిర్మాణాలు దాని చారిత్రక, నిర్మాణ, సాంస్కృతిక ప్రాధాన్యతను ప్రతిబింబిస్తున్నాయని తపాలా శాఖ పేర్కొంది.

**ఇప్పటివరకు తపాలా బిళ్ల లేదు**

గుత్తి కోటపై ఇప్పటివరకు స్మారక తపాలా బిళ్ల విడుదల కాలేదని తపాలా శాఖ అధికారికంగా నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రతిపాదనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.

**లక్ష బిళ్లల నిబంధనకు మినహాయింపు కోరిన ఎంపీ**

స్మారక తపాలా బిళ్లల విడుదలకు సాధారణంగా అమల్లో ఉన్న లక్ష బిళ్లల తప్పనిసరి కొనుగోలు నిబంధన నుంచి గుత్తి కోట ప్రతిపాదనకు మినహాయింపు ఇవ్వాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు. ఈ మినహాయింపుతో కూడిన ప్రతిపాదనను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి ఆమోదం కోసం తపాలా శాఖ ఫైల్లో సమర్పించింది.

**జిల్లా వారసత్వాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయడమే లక్ష్యం**

అనంతపురం జిల్లాకు ఉన్న గొప్ప చారిత్రక వారసత్వాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదలకు ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే గుత్తి కోట చరిత్రకు, అనంతపురం జిల్లా ప్రజలకు ఇది ఒక ప్రత్యేక గౌరవంగా నిలుస్తుంది" అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి పేర్కొన్నారు

## వినాయక చవితి వేడుకలు

# ప్రశాంతంగా నిర్వహించాలి

- మండపాలకు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అనుమతులు..
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**కణేకల్ - సూర్య వాస్తవం:** వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసులు సూచించారు. వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. వేడుకలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా శాంతిభద్రతలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు, కళ్యాణదుర్గం ఎస్ డి పి ఓ పి. రవి కుమార్ పర్యవేక్షణలో కణేకల్ పోలీస్ స్టేషన్‌లో మండల స్థాయి అధికారులతో పాటు వినాయక మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో షాషావలి, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ , ఫైర్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి మంజుల, హెచ్.ఎల్.సి ఏఈఈ మారుతి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ షరీఫ్, రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, కణేకల్ ఎస్ఐ నాగ మధు, ఏఎస్ఐ శంకర్ రెడ్డి ,పోలీసు సిబ్బంది , ఇతర శాఖల అధికారులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

**రహదారులకు ఇబ్బంది కలగకుండా మండపాలు**

వినాయక మండపాలు, స్వాగత తోరణాల ఏర్పాటుతో రహదారులు, ఫుట్‌పాత్‌లు, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. మండపాల వద్ద విద్యుత్ వైరింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లను నిపుణుల సహాయంతో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, అక్రమ విద్యుత్ కనెక్షన్లను వినియోగించరాదని తెలిపారు. డీజేలు, లౌడ్‌స్పీకర్లు, ఇతర సౌండ్ సిస్టమ్‌లను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై అమలులో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

**పుకార్లను నమ్మొద్దు**

వినాయక మండపాల వద్ద నిర్వాహకులు, వాలంటీర్లు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని, వాటిని ఫార్వర్డ్ చేయకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇతర మతాలు, వర్గాలు, వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసేలా నినాదాలు, పాటలు, ప్రసంగాలు, బ్యానర్లు ఉండకూడదని హెచ్చరించారు.

**నిమజ్జనానికి ప్రత్యేక భద్రతా చర్యలు**

కణేకల్ పట్టణంలోని ఉరవకొండ రోడ్డు, చిక్కన్నేశ్వర స్వామి సర్కిల్, మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా పోలీసులు సూచించిన రూట్, సమయం, నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కణేకల్ పట్టణంలోని వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని రాంనగర్‌లోని హెచ్ ఎల్ సి కెనాల్ వద్ద నిర్వహించే సమయంలో పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈత రాని వ్యక్తులు, చిన్నపిల్లలు నీటిలోకి దిగకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో నిమజ్జనం జరిగితే తగినంత లైటింగ్, భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని తెలిపారు.

**మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు**

నిమజ్జన ఊరేగింపుల సమయంలో మద్యం సేవించి వాహనాలు నడపరాదని పోలీసులు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఒక వాహనంపై అధిక సంఖ్యలో ప్రయాణించరాదని సూచించారు.

ఊరేగింపుల సమయంలో కత్తులు, కర్రలు, ఆయుధాలు, మండే పదార్థాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులను తీసుకెళ్లరాదని స్పష్టం చేశారు. బాణసంచా కాల్చడం, ప్రమాదకర విన్యాసాలు చేయడం, వాహనాలపై నిలబడి ప్రయాణించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నిబంధనలు ఉల్లంఘించినా, పోలీసుల సూచనలను ధిక్కరించినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరమణ హెచ్చరించారు.వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలు, సోదరభావం, శాంతి, సామరస్యంతో నిర్వహించుకోవాలని కళ్యాణదుర్గం ఎస్ డి పి ఓ పి. రవి కుమార్, సీఐ వెంకటరమణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పండుగను ఆనందంగా జరుపుకుంటూనే నిబంధనలు పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## కోర్టులో 12న జాతీయ లోక్ అదాలత్...!

**ఉరవకొండ టౌన్ - సూర్య వాస్తవం :** రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన ఉరవకొండ కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవా అధికార కమిటీ చైర్మన్ ఖాజా మైనుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకునేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ కాదగిన కేసులకు ఇరుపక్షాల అంగీకారంతో సత్వర పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. కేసుల పరిష్కారానికి ఇరుపక్షాలు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కేసులను సులభంగా పరిష్కరించుకోవాలని కోరారు.



# కార్యకర్త కన్నీటి వేళ.. అండగా టీడీపీ

- పాడె మోసి.. పార్టీ అనుబంధాన్ని చాటిన నెలవల
- బాలయ్య పాడె మోసిన నెలవల.. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా
- కార్యకర్త మృతితో దిగ్భ్రాంతి..
- అంత్యక్రియల్లో పాల్గొని ఘన నివాళులర్పించిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం
- ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నేత పేరం వెంకటతేజ నాయుడు రూ.20 వేల ఆర్థిక సాయం.
- కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన పార్టీ శ్రేణులు



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ఓ కార్యకర్త కన్నుమూసిన వేళ తెలుగుదేశం పార్టీ నాయకత్వం, శ్రేణులు ఆయన కుటుంబానికి అండగా నిలిచాయి. పెళ్లకూరు మండలం వడ్డీపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు, 137వ బూత్ ఇన్‌చార్జి వలిపి బాలయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలయ్య అంత్యక్రియలు గురువారం వడ్డీపాలెం గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు, టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో విషాద వాతావరణంలో నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం హాజరై బాలయ్యకు ఘన నివాళులర్పించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తకు చివరి వీడ్కోలు పలికేందుకు స్వయంగా పాడె మోసి ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

**పాడె మోసి.. పార్టీ అనుబంధాన్ని చాటిన నెలవల**

కార్యకర్త కష్టాల్లో ఉన్నప్పుడు నాయకత్వం అండగా ఉంటుందనే సందేశాన్ని నెలవల సుబ్రహ్మణ్యం తన చర్య ద్వారా చాటిచెప్పారు. బాలయ్య పాడె మోసి అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన, పార్టీ కార్యకర్తల పట్ల తనకున్న ఆత్మీయతను, బాధ్యతను చాటుకున్నారు. బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన నెలవల సుబ్రహ్మణ్యం, వారి దుఃఖంలో టీడీపీ కుటుంబం మొత్తం భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. బాలయ్య కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఏ సమయంలోనైనా సహాయ సహకారాలకు పార్టీ శ్రేణులు ముందుంటాయని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ కుటుంబ సభ్యుడిగానే భావిస్తామని, కార్యకర్తల సంక్షేమం, వారి కుటుంబాల బాగోగులు పార్టీ నాయకత్వానికి ముఖ్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

**కార్యకర్త కుటుంబానికి ఎన్‌ఆర్‌ఐ నేత ఆర్థిక చేయూత**

బాలయ్య మృతి వార్త తెలుసుకున్న ఎన్‌ఆర్‌ఐ , తెలుగుదేశం పార్టీ నాయకుడు పేరం వెంకటతేజ నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలయ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకుని అంత్యక్రియల నిర్వహణకు తక్షణ సహాయంగా రూ.20,000 ఆర్థిక సాయం అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని బాలయ్య కుమారుడు వలిపి శేఖర్‌బాబుకు టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, పేరం మధుసూదన్ నాయుడు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేరం వెంకటతేజ నాయుడు మరోసారి చాటిచెప్పారని టీడీపీ నాయకులు తెలిపారు. కార్యకర్త కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో స్పందించి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. వలిపి బాలయ్య తెలుగుదేశం పార్టీకి నిబద్ధతతో పనిచేస్తూ గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరించారని పార్టీ నాయకులు గుర్తు చేసుకున్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన బాలయ్య సేవలను వారు స్మరించుకున్నారు. బాలయ్య మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కల్పించడం ప్రతి టీడీపీ కార్యకర్త బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. బాలయ్య అంత్యక్రియల్లో పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, మండల ప్రధాన కార్యదర్శి శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, పేరం మధుసూదన్ నాయుడు, దువ్వూరు రాకేష్‌రెడ్డి, లోకేష్ నాయుడు, కండలమూడి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలయ్య పార్థివదేహానికి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యకర్తకు కష్టకాలంలో అండగా నిలవడం, కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవడం ద్వారా తెలుగుదేశం పార్టీ తన కార్యకర్తల పట్ల ఉన్న బాధ్యతను మరోసారి చాటిందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. బాలయ్య లాంటి నిబద్ధత కలిగిన కార్యకర్తల సేవలు పార్టీకి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.



# పశుసంపదకు ఆరాధన.. సంతానానికి ఆయురారోగ్య రక్షణ

**- పొలాల అమావాస్య విశిష్టతను తెలిపిన బొల్లు రామ మోహన్**







**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రకృతి, వ్యవసాయ జీవనంతో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉన్నాయి. రైతులకు నిత్యం తోడుగా నిలిచే పశువుల పట్ల కృతజ్ఞతను చాటుకోవడంతో పాటు, కుటుంబ శ్రేయస్సు, సంతాన క్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఆచరించే విశిష్టమైన పర్వదినమే 'పొలాల అమావాస్య' అని రచయిత బొల్లు రామ మోహన్ తెలిపారు. వర్షాకాలంలో పొలం దున్నడం నుంచి నాట్లు పూర్తయ్యే వరకు రైతులతో పాటు పశువులు కూడా ఎంతో శ్రమిస్తాయని, నాట్లు పూర్తయి పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడే శ్రావణ బహుళ అమావాస్య రోజున వాటికి కృతజ్ఞతగా ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పశువులను శుభ్రంగా కడిగి, కొమ్ములకు రంగులు వేసి, గజ్జెలు, పూలమాలలతో అలంకరించి పూజలు చేయడం ద్వారా పశుసంపద ప్రాధాన్యతను చాటుతారని వివరించారు. సంతాన రక్షణ కోసం పోలేరమ్మ వ్రతం కూడా ఈ పర్వదినానికి ప్రత్యేకతగా ఉందన్నారు. సంతానవతులైన మహిళలు తమ పిల్లల ఆయురారోగ్యాలు, క్షేమం కోసం భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరిస్తారని తెలిపారు. పౌరాణిక కథనం ప్రకారం, పోలేరమ్మ అమ్మవారి కరుణతో మరణించిన పిల్లలు తిరిగి ప్రాణాలు పొందిన సంఘటనకు గుర్తుగా సంతాన రక్షణ కోసం ఈ వ్రతం ఆచరించే సంప్రదాయం ఏర్పడిందని పేర్కొన్నారు.

**పూజా విధానం**

పూజా గదిలో కంద మొక్కను ప్రతిష్ఠించి, తొమ్మిది పసుపు కొమ్ములతో తోరణం కడతారు. అనంతరం విఘ్నేశ్వరుడిని పూజించి, కంద మొక్కలో మంగళగౌరీ దేవి లేదా సంతానలక్ష్మిని షోడశోపచార పద్ధతిలో ఆరాధిస్తారు. ఐదు రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించి వ్రత కథను వింటారు. అనంతరం ముత్తైదువులకు భోజనం, తాంబూలాలు అందించి వారి ఆశీస్సులు పొందుతారు. 'సర్వే భవంతు సుఖినః.. సర్వే సంతు నిరామయాః' అనే శాంతి సందేశాన్ని చాటే ఈ పర్వదినం కేవలం ఆచారంగా కాకుండా జీవకారుణ్యం, మానవత్వం, కృతజ్ఞతలకు ప్రతీకగా నిలుస్తుందని రామ మోహన్ పేర్కొన్నారు. ప్రకృతితో పాటు మన మనుగడకు సహకరించే ప్రతి జీవి పట్ల దయ, ప్రేమ, కృతజ్ఞత కలిగి ఉండాలనే సందేశాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు బొల్లు రామ్మోహన్ రచయిత

# టీడీపీ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగానే ఉంటుంది

**- వలిపి బాలయ్య పాడి మోసిన సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం**



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** పెళ్లకూరు మండలం వడ్డీపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త వలిపి బాలయ్య కుటుంబాన్ని పరామర్శించి బాలయ్య అంత్యక్రియలో పాల్గొని బాలయ్య పాడిన మోసి. కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ఉంటుందని సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్ర హ్మణ్యం అన్నారు.

ఆయన గురువారం. వడ్డిపాలెం తెలుగుదేశం పార్టీ కార్యకర్త అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ,బుధవారం రోజున వైఎస్ఆర్సిపి గుండాల చేతిలో ప్రాణాలు విడిచిన వలిపి బాలయ్య అంత్యక్రియలు పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు మధ్య వడ్డీపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొని వలిపి బాలయ్య పాడి మోసి వారికి ఘన నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి తెలుగుదేశం పార్టీ ఎప్పుడు మీ కుటుంబానికి అండగా నిలబడుతుందని తెలియజేశారు. అదేవిధంగా మండల పార్టీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ప్రధాన కార్యదర్శి దర్శనం భేటీ చైతన్య కృష్ణారెడ్డి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రమేష్ నాయుడు,పేరు మధుసూదన్ నాయుడు లు ఒలిపి బాలయ్య పాడి మోసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థించడం జరిగింది.

# నంద్యాల--కర్నూలు రైల్వే గేట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- తక్షణమే అండర్‌వే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- నక్కీ శ్రీకాంత్, సీపీఎం పట్టణ కార్యదర్శి
- పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజల చిరకాల కోరికను నెరవేర్చాలి
- రైల్వే గేట్ల సమస్య పరిష్కారం కోసం కదులుదాం రండి-
- సాధిద్దాం రండి
- ప్రజలతో సీపీఎం -- ప్రచార జాత -- సంతకాల సేకరణ



**డోన్– సూర్య వాస్తవం :** పట్టణంలోని నంద్యాల--కర్నూలు రైల్వే గేట్ల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తక్షణమే అండర్‌వే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం డోన్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సీపీఎం మండల కార్యదర్శి రామాంజనేయులు ప్రారంభించారు. అనంతరం ప్రజలను చైతన్యపరిచేందుకు ఏర్పాటు చేసిన ప్రచార జాతను సీపీఎం పట్టణ కమిటీ సభ్యురాలు షేమిమ్ బేగం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ మండల కార్యదర్శులు నక్కీ శ్రీకాంత్, రామాంజనేయులు పట్టణ కమిటీ సభ్యులు చిన్న రహిమాన్, శివరాం, షేమిమ్ బేగం శ్రీనివాసులు, నక్కీ హరి మాట్లాడుతూ డోన్ పట్టణం మొట్టమొదటిగా పురుడు పోసుకున్న ప్రాంతాల్లో పాతపేట కాలనీ ఒకటని, ఈ ప్రాంతం అనేక వ్యాపారాలకు ప్రసిద్ధిగాంచిందని అన్నారు. ఆనాటి గ్రామపంచాయతీ నుంచి నేటి మున్సిపాలిటీ వరకు పరిపాలనా వ్యవస్థలో ఈ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉండేదన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రభుత్వ వైద్యశాల ( సిహెచ్సి) కూడా ఇక్కడే ఉండేదని తెలిపారు. అయితే పాతపేట కాలనీకి ఇరువైపులా ఉన్న నంద్యాల--కర్నూలు రైల్వే గేట్ల సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రమాదాలకు గురైనవారు, అత్యవసర వైద్య సేవలు అవసరమైనవారు, ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లే గర్భిణులు, పట్టణం--గ్రామాల్లో జరిగిన వివిధ ఘటనల్లో గాయపడినవారు ఆసుపత్రికి చేరుకునే సమయంలో రైల్వే గేట్లు మూసివేయబడటంతో అనేక సందర్భాల్లో ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడాలని, నంద్యాల--కర్నూలు రైల్వే గేట్ల సమస్యను పరిష్కరించాలని సీపీఎం పార్టీ, ప్రజా సంఘాలు అనేక సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహించాయని తెలిపారు. ఆ పోరాటాల ఫలితంగా పాతపేట ప్రాంతంలో ఉన్న మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాలను నూతన ప్రాంతాలకు తరలించినప్పటికీ, రైల్వే గేట్ల సమస్య మాత్రం పరిష్కారం కాలేదన్నారు. కార్యాలయాలు, ఆసుపత్రి తరలింపుతో ప్రజల సమస్య తగ్గకపోగా మరింత పెరిగిందని విమర్శించారు. నంద్యాల--కర్నూలు రైల్వే గేట్ల సమస్య కారణంగా పాతపేట ప్రాంతంలోని వ్యాపార సముదాయాలు క్రమంగా సన్నగిల్లాయని, ఇక్కడి వ్యాపారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. రైల్వే గేట్ల సమస్య కారణంగా డోన్ పట్టణం రెండు ప్రాంతాలుగా విడిపోయిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కొండపేట, చిగురుమానుపేట, పాతపేట ప్రాంతాల ప్రజలు వ్యాపారాలు చేసుకోవడానికి, అద్దె ఇళ్ల కోసం ఈ ప్రాంతాలకు రావడానికి కూడా వెనుకాడుతున్నారని అన్నారు. ఈ రెండు రైల్వే గేట్ల సమస్య కారణంగా పట్టణ ప్రజలు నేటికీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుల మతాలకు అతీతంగా ఉన్న హిందూ ముస్లిం, క్రైస్తవ ప్రజలు తమ కుటుంబ సభ్యులు మరణించినప్పుడు అంత్యక్రియల కోసం స్మశాన వాటికలకు వెళ్లే సమయంలో కూడా రైల్వే గేట్లు మూసివేయబడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు పట్టణం పూల వ్యాపారానికి కేంద్ర బిందువుగా ఉందని, పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన దాదాపు 3 వేల మందికి పైగా ప్రజలు పూల వ్యాపారం కోసం మార్కాపురం గిద్దలూరు గద్వాల బళ్లారి మహబూబ్‌నగర్, రాయచూర్ తదితర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు.

రైల్వే గేట్ల సమస్య కారణంగా పూల కొనుగోలు కేంద్రాలకు వెళ్లే సమయంలో కూడా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పాతపేట కాలనీలో పూర్వం నుంచి ప్రసిద్ధిగాంచిన అమ్మవారి శాల, మాలిక్ బాబా గుడి, శ్రీరాముల దేవాలయాలు ఉన్నాయని, వీటికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని స్థానిక ప్రజల విశ్వాసమని తెలిపారు. అలాగే కుల, మతాలకు అతీతంగా జరుపుకునే పీర్ల పండుగకు కూడా ప్రత్యేకమైన సంప్రదాయం ఉందన్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసే పీర్లు రెండు రైల్వే గేట్ల మధ్యలో ఉన్న దస్తగిరి స్వామి దర్గా వద్దకు చేరుకుని, అక్కడి నుంచి కలిసి వెళ్లే ఆనవాయితీ పూర్వం నుంచి కొనసాగుతోందని తెలిపారు.

కానీ రైల్వే గేట్ల సమస్య కారణంగా భక్తులు, ప్రజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెళ్లే సమయంలో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సీపీఎం పార్టీ, ప్రజా సంఘాలు, వామపక్ష ప్రజా ఉద్యమాలు అనేక సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వ హయాంలో అండర్‌వే బ్రిడ్జి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ మరియు దక్షిణ మధ్య రైల్వే భాగస్వామ్యంతో రూ.12 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. 01-07-2023న అండర్‌వే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ, ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. శంకుస్థాపన చేసిన శిలాఫలకం సైతం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రజల ఓట్లతో ముఖ్యమంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా, రాష్ట్ర మంత్రులుగా పదవులు అనుభవించిన, అనుభవిస్తున్న ప్రజాప్రతినిధులు ప్రతి ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని, కానీ డోన్ ప్రజలు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న నంద్యాల--కర్నూలు రైల్వే గేట్ల సమస్య మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదని విమర్శించారు.

**పార్టీలకు అతీతంగా ప్రజలు ఐక్యంగా నిలబడాలి**

కులం, మతం, పార్టీ, ప్రాంతం అనే తేడాలు లేకుండా డోన్ పట్టణ ప్రజలందరూ నంద్యాల--కర్నూలు రైల్వే గేట్ల సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఐక్యంగా నిలబడాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అండర్‌వే బ్రిడ్జి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి దశలవారీ పోరాటాలు నిర్వహించి, పాలక ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యం శెట్టి, అశోక్, బి.బి. షబానా సూర్య, పద్మావతి, హుస్సేన్ భాష, గిరిధర్, మదన గోపాల్ మహేష్, సిరిన్, మాధవి, ముంతాజ్ బేగం తదితరులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి ఒక జీవితాన్ని కాపాడండి



**జమ్మలమడుగు – సూర్య వాస్తవం:** స్థానిక మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ అహామద్ హుస్సేన్ కర్నూలు అమీలియో హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న రియాజున్ అనే మహిళకు రక్తం తక్కువ ఉండటంతో ఎం పాజిటివ్ రక్తం అత్యవసరం కాగా వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రసిడెంట్ అహమ్మద్ హుస్సేన్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి జమ్మలమడుగు నుంచి కర్నూలు కు వెళ్లి ఎం పాజిటివ్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. రక్త దాత అయినటువంటి అహమ్మద్ హుస్సేన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్తం అవసరమైన వారు సంప్రదించవలసిన నంబర్లు 8297253484, 9182244150.

# నా కథేనా అనుకున్నా!



## 'సీన్'.. మరోసారి పవర్ ఫుల్ పోలీసాఫీసర్‌గా సూర్య

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, దర్శకుడు జితూ మాధవన్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్ వచ్చేసింది. బుధవారం ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'సీన్' అనే పేరును ఖరారు చేస్తూ, ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచుతోంది. "అతని నీచమైన స్వభావాన్ని దాచిపెట్టడానికి మీరంతా అతని ప్రతిభను ప్రదర్శిస్తున్నారు" అనే వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత పోలీస్ గెటప్‌లో సూర్య ఒక క్రైమ్ సీన్‌లోకి ఎంట్రీ ఇస్తాడు. "ఎవరు ఎవర్ని చంపారు?" అని ఆయన అడగ్గా, "అది కనుక్కోవడానికే కదా మీరు వచ్చింది" అని ఓ కానిస్టేబుల్ సమాధానమిస్తాడు. ఈ చిత్రంలో సూర్య 'డీఎస్పీ ఇన్బరాజ్' అనే పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటిస్తున్నారు. "సందేహితులు ఇన్బరాజ్ సార్‌ను చూస్తే చాలు, వింతగా ప్రవర్తించడం మొదలుపెడతారు" అని జైల్ వార్డెన్ చెప్పడం, "ఇన్బరాజ్ సార్ వస్తున్నారు, ఎవరూ బయటకు రావొద్దు" అని ఖైదీలను హెచ్చరించడం వంటి సన్నివేశాలు పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. "నా ముఖం బాగా చూసుకో. నీకు, నిన్ను అరెస్ట్ చేసిన ఒకే ఒక్క పోలీస్‌ను నేనే కావచ్చు.. కానీ నాకు, నేను జైల్లో పెట్టిన 900 మంది నేరస్థుల్లో నువ్వొకడివి" అంటూ సూర్య చెప్పే డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమా టైటిల్‌ను ప్రకటిస్తూ సూర్య తన 'ఎక్స్' ఖాతాలో, "అందరికీ నమస్కారం, ఇదిగో 'సీన్' నుంచి చిన్న గ్లింప్స్. నవంబర్ 6 నుంచి థియేటర్లలో. #Deepavali2026" అని పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తుండగా, వినీత్ ఆగస్టియన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జితూ మాధవన్ - సూర్య కాంబినేషన్ ప్రకటన వచ్చినప్పటి నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య గతంలో సింగం సిరీస్ సినిమాల్లో శక్తిమంతమైన పోలీస్ అధికారిగా కనిపించడం తెలిసిందే.



ఆనంద్ దేవరకొండ వైష్ణవి చైతన్య జంటగా యువ దర్శకుడు ఆదిత్య హాసన్ తెరకెక్కించిన తాజాచిత్రం 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్'. సెప్టెంబర్ 11న రిలీజ్ అవుతున్న ఈ చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు హీరో ఆనంద్. వనపర్తికి చెందిన ఒక సాధారణ కుర్రాడు, తన ప్యాషన్‌ను పక్కన పెట్టి, తల్లిదండ్రుల కోసం విదేశాలకు వెళ్తాడు. అక్కడ నుంచి అతను జీవితాన్ని చూసే కోణం ఎలా మారుతుంది? అక్కడ ఒకమ్మాయిని ప్రేమించి, లివిన్ రిలేషన్(లో ఉంటే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అనేది సహజంగా చూపించాం. లివిన్ రిలేషన్ కాన్సెప్ట్ అయినప్పటికీ, కుటుంబ ప్రేక్షకులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా దర్శకుడు ఆదిత్య ఎంతో అందంగా ఈ సినిమాను తీర్చిదిద్దాడు. ఆదిత్య పాత్రలో నన్ను నేను నూటికి నూరు శాతం చూసుకున్నా. కథ వింటున్నప్పుడే ఇదేంటి నా కథలాగే ఉంది అనుకున్నా. విదేశాల్లో చదువుకుంటున్న తెలుగువారంతా ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతారు. ప్రతి సన్నివేశం, ప్రతి సంభాషణ హత్తుకునేలా ఉంటాయి. 'బేబీ' అంత పెద్ద విజయం సాధించింది కాబట్టి.. నేను, -వైష్ణవి కలిసి నటిస్తున్నప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడటం సహజమే. అయితే 'బేబీ'కి, 'ఎపిక్' సినిమాకూ పోలిక లేదు. రెండూ దేనికవే ప్రత్యేకమైనవి. బేబీ ఒక సంచలనమైతే, ఇది ఒక అందమైన ప్రయాణం లాంటిది. నేను, -వైష్ణవి కలిసి నటించినప్పటికీ బేబీ గురించి ఎంత మాట్లాడుతున్నారో.. 90ం వెబ్ సిరీస్ గురించి, ఆదిత్య హాసన్ గురించి కూడా అదే స్థాయిలో మాట్లాడుతున్నారు. అది సినిమాకు కలిసివచ్చే అంశమే! నా తదుపరి చిత్రాలు గురించి..- 'తక్షకుడు' సినిమా షూటింగ్ పూర్తయింది. ఒక ఇండో-కొరియన్ మూవీ కూడా పూర్తి చేశా.



80స్, 90స్, 2000స్.. ఇలా అన్ని జనరేషన్ల వారికి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. చదువు కోసం విదేశాలకు వెళ్లిన వారికి మాత్రమే కాకుండా, కుటుంబానికి దూరంగా ఉండే ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. ఒక మధ్య తరగతి యువకుడి జీవితంలో చిన్న చిన్న విషయాలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఇది ప్రతి ఒక్కరి కథ. నిజ జీవితంలో జరిగే కొన్ని సంఘటలను మనం అద్దంలో చూసుకుంటే ఎలా ఉంటుందో ఈ మూవీ అలా ఉంటుంది. ప్రేమ, కుటుంబం, బాధ్యతలు.. ఇలా ఇందులోని ప్రతి అంశం గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటారు. ఇది రెగ్యులర్ మూవీలా కాకుండా అందమైన జర్నీలా ఉంటుంది. వైష్ణవి చైతన్య పోషించిన కదలి పాత్ర ప్రతి అమ్మాయికీ కనెక్ట్ అవుతుంది. ఒక అమ్మాయి పైకి నవ్వుతూ కనిపిస్తున్నంత మాత్రాన, తను సంతోషంగా ఉందని కాదు. ఆమె వెనుక భయాలు, బాధ్యతలు ఉంటాయి. అలాంటి పాత్ర కదలి. మా వదిన రష్మిక, నేనూ సినిమాల గురించి పెద్దగా మాట్లాడుకోం. కానీ, ఎపిక్ ఎప్పుడు విడుదల చేయాలని రిలీజ్ డేట్ కోసం కొంచెం టెన్షన్ పడుతున్న సమయంలో.. వదిన నాకు మెంటల్‌గా సపోర్ట్‌గా నిలబడ్డారు.



# 13 ఏళ్ల నిరీక్షణకు తెర..

# దులీప్ ట్రోఫీ విజేతగా ఈస్ట్ జోన్

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. సౌత్ జోన్‌పై మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, 2012-13 సీజన్ తర్వాత మళ్లీ ప్రతిష్ఠాత్మకమైన ఈ ట్రోఫీని ముద్దాడింది. ఇది ఈస్ట్ జోన్‌కు మూడో దులీప్ ట్రోఫీ టైటిల్ కావడం విశేషం. ఆఖరి రోజు ఆట ప్రారంభమైన తర్వాత ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. మహ్మద్ కౌనైన్ ఖురేషీ (116 నాటౌట్) తన కెరీర్‌లో తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీతో అదరగొట్టగా, అనుకుల్ రాయ్ (64) అర్ధశతకంతో రాణించాడు. 99.2 ఓవర్లలో 7 వికెట్లకు 388 పరుగులు చేసిన తర్వాత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. డిక్లరేషన్ ప్రకటించిన వెంటనే, ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్ ఆటగాళ్లు విజయోత్సవాల్లో మునిగిపోయారు. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లోనే ఈస్ట్ జోన్ తన పట్టు బిగించింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) అద్భుతమైన డబుల్ సెంచరీకి, కుమార్ కుశాగ్ర (101) శతకం తోడవడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీనికి సమాధానంగా సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌట్ కావడంతో మ్యాచ్ ఫలితం దాదాపుగా ఖరారైంది. ఇషాన్ కిషన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేసి, మ్యాచ్ మొత్తంలో 350 పరుగులతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈస్ట్ జోన్ విజయంలో ఝార్ఖండ్‌కు చెందిన యువ ఆటగాళ్లు కీలక పాత్ర




పోషించారు. కుశాగ్రతో పాటు తన అరంగేట్ర దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లోనే శిఖర్ మోహన్ 85 పరుగులతో ఆకట్టుకున్నాడు. గత దేశవాళీ సీజన్‌లో ప్రదర్శించిన ఫామ్‌ను అతను కొనసాగించాడు. ఈ ముగ్గురి ప్రదర్శనతో ఈస్ట్ జోన్ టైటిల్ విజయంలో ఝార్ఖండ్ ఆటగాళ్ల ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఆఖరి రోజు ఉదయం ఖురేషీ, అనుకుల్ రాయ్ ఏడో వికెట్‌కు 150 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే స్లో ఓవర్ రేట్ కారణంగా 73వ ఓవర్‌లో సౌత్ జోన్‌కు అంపైర్లు 5 పరుగుల పెనాల్టీ విధించారు. 96వ ఓవర్లో పేసర్ సీవీ మిలింద్ బౌలింగ్‌లో రెండు పరుగులు తీసి ఖురేషీ తన తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. చెపాక్‌లోని తీవ్రమైన తేమ, ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా సౌత్ జోన్ పేసర్ మహ్మద్ సిరాజ్ తన పోరాట పటిమను ప్రదర్శించాడు. మ్యాచ్ ఫలితం తేలిపోయినప్పటికీ, ఏకధాటిగా తొమ్మిది ఓవర్లు బౌలింగ్ చేసి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కిషన్ డిక్లరేషన్ ప్రకటించిన వెంటనే, అంపైర్లు బెయిల్స్‌ను తొలగించి మ్యాచ్‌ను ముగించారు. దీంతో ఈస్ట్ జోన్ ఆటగాళ్లు మైదానంలోనే సంబరాలు చేసుకున్నారు. ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ ఒక స్టంప్‌ను చేతిలో పట్టుకుని డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకులకు అభివాదం చేశారు.

### సంక్షిప్త స్కోర్లు:

ఈస్ట్ జోన్: 708 & 388/7 డిక్లేర్డ్ (మహమ్మద్ ఖురేషి 116 నాటౌట్, ఇషాన్ కిషన్ 80; ఎండీ నిధీష్ 2-28)సౌత్ జోన్: 336 (తిలక్ వర్మ 99; ముఖేశ్ కుమార్ 3-62)




## మహిళల ఆసియా కప్ ఫైనల్లోకి

### దూసుకెళ్లిన భారత్.. బంగ్లాదేశ్ ఫినిష్

మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్ వేదికగా జరిగిన సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగగా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఆది నుంచి క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. షోర్నా అక్తర్ (22లి) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ విజయంతో టీమిండియా ఆసియా కప్ ఫైనల్‌లో అడుగుపెట్టింది. అంతకు ముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఆరంభంలోనే స్మృతి మంధాన (2) వికెట్‌ను కోల్పోయినా, షఫాలీ వర్మ తనదైన శైలిలో బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. కేవలం 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేసింది. ఆమెకు జతగా ప్రతిక రావల్ (20) రాణించింది. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24లి), రిచా ఘోష్ (21), దీప్తి శర్మ (13) వేగంగా పరుగులు చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగుల మంచి స్కోరును నమోదు చేసింది. రేపు (సెప్టెంబరు 11) జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి. ఈ మ్యాచ్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది.

# వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

**- ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి**

**- మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి**





**రాయచోటి - - సూర్య వాస్తవం:** ఈ నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను శాంతి యుతంగా, క్రమబద్ధంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మదనపల్లె సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ వినాయక చవితి ప్రతి ఇంట్లో ఆనందాన్ని నింపే పండుగగా, ఎలాంటి విషాద ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. వివిధ శాఖలు, ఉత్సవ నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులు పరస్పర సమన్వయం, సహకారంతో పనిచేయాలని సూచించారు.

మదనపల్లె సామరస్య సంప్రదాయాన్ని కొనసాగించాలి. మదనపల్లె పట్టణంలో అన్ని మతాల ప్రజలు పరస్పర సహకారంతో వివిధ పండుగలను సామరస్యపూర్వకంగా నిర్వహించు కుంటున్నారని, ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వినాయక చవితి ఉత్సవాలను కూడా ప్రశాంతంగా నిర్వహించాలని అన్నారు. గతంలో సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు.

**నిమజ్జన ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి**

వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులు, నీటి వనరులను ముందుగానే గుర్తించినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, పారిశుధ్యం, రహదారి సౌకర్యాలను సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు అవసరమైన చోట రహదారి, పొదల తొలగింపు పనులు చేపట్టాలని, ఇరిగేషన్ శాఖ అధికారులు అవసరమైన డీసిల్టేషన్ పనులు చేపట్టాలని సూచించారు.

**పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి**

నీటి వనరులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో వాటిని కాలుష్యానికి గురికాకుండా పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ఉత్సవ నిర్వాహకులు పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా సహకరించాలని సూచించారు.

**మండపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి**

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి వినాయక మండపాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, డీజేలు, విద్యుత్, అగ్నిమాపక భద్రత తదితర అంశాలకు సంబంధించి అవసరమైన అనుమతులు ముందుగానే పొందాలని తెలిపారు.

**రాత్రి 10 గంటల తర్వాత డీజేలకు అనుమతి లేదు.**

మదనపల్లి డీఎస్పీ బుచ్చిరాజు మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అవసరమైన అనుమతులు జారీ చేయాలని సంబంధిత అధికారులను కోరారు. రాత్రి 10 గంటల తర్వాత డీజేలకు అనుమతి లేదని, నిర్ణీత శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రులు, పాఠశాలలు, ఇతర సున్నిత ప్రాంతాలకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలని సూచించారు.

**అసభ్యకర కార్యక్రమాలకు తావివ్వకూడదు**

వినాయక మండపాల వద్ద అసభ్యకరమైన పాటలు, నృత్యాలు, మద్యం సేవించి గొడవలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అలాంటి వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు యువతకు ముందుగానే తగిన సూచనలు చేయాలని కోరారు.

**సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, నిర్వహకులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 8571231181 మరియు ల్యాండ్ లైన్ నెంబర్ 8571 231181సబ్ కలెక్టర్ కార్యాలయం లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఏదైనా సమస్య తలెత్తితే ఈ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఉత్సవ నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో మీడియా ప్రతినిధుల పాత్ర కీలకమని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భద్రతా సూచనలు, పర్యావరణ పరిరక్షణ, శబ్ద కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.

ప్రతి శాఖ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తూ, ఉత్సవ నిర్వాహకులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, ఆనందదాయకంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరియేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయ వంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో మదనపల్లె తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, మదనపల్లె డివిజన్‌లోని వివిధ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, అగ్నిమాపక శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, వినాయక ఉత్సవాల నిర్వాహకులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పద్మశ్రీ డా. యలవర్తి నాయుడమ్మ స్మారక పురస్కారం అందుకున్న డా. గల్లా రామచంద్ర నాయుడు

**తిరుపతి- సూర్య వాస్తవం:** అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక చైర్మన్ డా. గల్లా రామచంద్ర నాయుడు ప్రతిష్ఠాత్మక "పద్మశ్రీ డా. యలవర్తి నాయుడమ్మ స్మారక పురస్కారం--2026" అందుకున్నారు. గురువారం తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని డా. గల్లా రామచంద్ర నాయుడుకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త, పద్మశ్రీ డా. యలవర్తి నాయుడమ్మ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖ వ్యక్తికి ఈ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. పారిశ్రామిక రంగంలో అమర రాజా గ్రూప్‌ను అభివృద్ధి చేయడంతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, సామాజిక సేవలు తదితర రంగాల్లో డా. గల్లా రామచంద్ర నాయుడు అందిస్తున్న విశేష సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఆయనను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎం. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, డా. యలవర్తి నాయుడమ్మ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. సమాజ అభివృద్ధికి వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న ప్రముఖులను గుర్తించి సత్కరించడం ద్వారా మరింత మంది సేవా స్ఫూర్తితో ముందుకు సాగేందుకు ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. డా. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, డా. యలవర్తి నాయుడమ్మ పేరుతో అందజేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని స్వీకరించడం గౌరవంగా భావిస్తున్నాన న్నారు. సమాజ అభివృద్ధికి తన వంతు కృషిని కొనసాగిస్తానని తెలిపారు. డా. యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన ఆహ్వానితులు పాల్గొన్నారు. డా. గల్లా రామచంద్ర నాయుడుకు ప్రతిష్ఠాత్మక డా. యలవర్తి నాయుడమ్మ స్మారక పురస్కారం లభించడం పట్ల అమర రాజా కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

## మత్స్యకారుల సొసైటీ ఎన్నికపై వివాదం

**- అధికారుల ఏకపక్ష తీరుపై ఆగ్రహం**



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** మండల కేంద్రంలోని తెలుగు గంగ ప్రాజెక్టు బ్రహ్మంసాగర్ కింద ఉన్న మత్స్యకారుల కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికను సభ్యులకు తెలియకుండానే రహస్యంగా నిర్వహించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రహ్మంసాగర్ సొసైటీకి సంబంధించి 35 మంది సభ్యులు ఉండగా వారికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా కేవలం కొందరి మాటలకు అధికారులు తలొగ్గి ఎన్నిక నిర్వహించారని బాధిత సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇదే తరహాలో వ్యవహరించారని ఇప్పుడు మళ్లీ అదే పద్ధతిని కొనసాగించడం మత్స్య శాఖ అధికారుల తీరుకు నిదర్శనమని మండిపడుతున్నారు. 35 మంది సభ్యులున్న సంఘంలో ఎవరికీ తెలియకుండా ఎన్నిక నిర్వహించడం దేనికి సంకేతమని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విచారణ జరిపి న్యాయం చేయాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

## లైంగిక ఆరోపణల ఫలితం...!

## మోడల్ స్కూల్ టీచర్ చింతా నారాయణ సస్పెన్షన్

**- పాఠశాలల్లో క్రమశిక్షణకు ప్రాధాన్యత: విద్యాశాఖ**

**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** గార్లదిన్నె మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు చింతా నారాయణను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు రావడంతో




విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. విచారణలో వెల్లడైన అంశాలపై రూపొందించిన నివేదికను పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేశారు. విద్యార్థుల భద్రత, పాఠశాలల్లో క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం.

## వేరుశనగ పంటలో పొలం బడి శిక్షణ

**- రసం పీల్చే పురుగుల ఉధృతి నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి**

**- క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించి వేప నూనె వాడకం ఎక్కవ సార్లు ఉపయోగించాలి- మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్టారెడ్డిలి**



**ముద్దనూరు - సూర్య వాస్తవం :** మండలంలోని పెనీకలపాడు గ్రామంలో గురువారం వేరుశనగ పంటలో పొలం బడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా పొలం పరిసరాల విశ్లేషణ చేసి చీడ పీడల ఉధృతిని గమనించడం జరిగిందన్నారు. రసం పీల్చే పురుగుల ఉధృతి నివారణ కొరకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 8 చొప్పున రైతుల సమక్షంలో వాటిని అమర్చే విధానంను తెలిపి వాటి వలన కలుగు ఉపయోగం గురించి రైతులకు వివరించారు. రైతులు క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించి జీవ సేంద్రియ ఎరువుల వాడకం, మరియు వేప కాషాయాలను విరివిగా వాడుకోవాలి అని తెలిపారు. అలాగే బయలాజికల్ పద్ధతులను అనుసరిస్తే మంచి పలితాలు వస్తాయని తెలిపారు. పొలం బడి లో రాజీ లేని సూత్రాల గురించి రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి ఎక్కువ ఆదాయం పెంపొందిచడమే పొలం బడి లక్ష్యం అని వివరించారు. లద్దె పురుగు నివారణకు ఎకరానికి 6 చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలి అని సూచించారు. వేప నూనె మందును 5 యమ్. యల్. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు నాగమణి, పకృతి వ్యవసాయ సిబ్బంది రామ సుధ మరియు రైతులు ఈశ్వర రెడ్డి, గోపాల్ రెడ్డి, బాబుల్ రెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

## ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర నేతల ఆత్మీయ సమ్మేళనానికి భారీగా వెళ్లిన పులివెందుల ఉద్యోగులు



**పులివెందుల- సూర్య వాస్తవం:** వైఎస్సార్ కడప జిల్లా ఏపీ ఎన్జీవోస్ సంఘ అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభకు పులివెందుల నుంచి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణలను ఎన్జీవోస్ తాలూకా సహాధ్యక్షుడు సుకుమార్ మరియు పులివెందుల ఉద్యోగ ప్రతినిధి నరేష్, ఆధ్వర్యంలో ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు భారీ సంఖ్యలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు రాష్ట్ర నేతలకు శాలువాలు కప్పి, గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుకుమార్, నరేష్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఏపీజేఏసీ, ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర నాయకత్వానికి, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ఏర్పాటు చేసిన జిల్లా అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నేతలను కలవడానికి అనుమతి కోరినప్పుడు, "సంఘం ఏ ఒక్కరి సొత్తూ కాదు మనందరి నాయకులను ఎవరైనా ఎప్పుడైనా కలవవచ్చు" ఎన్జీవోస్ సంఘం ప్రతి ఉద్యోగికి సమస్యలు పరిస్కారం చూపడాని ఎప్పుడు అందుబాటులో ఉంటుంది అని జిల్లా అధ్యక్షుడు విశాల హృదయంతో ప్రోత్సహించడం ఉద్యోగుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే పులివెందుల నుంచి మహిళా ఉద్యోగులతో సహా పెద్ద సంఖ్యలో తరలివచ్చామని తెలిపారు. భవిష్యత్తులోనూ పులివెందుల ఉద్యోగుల సమస్యలను జిల్లా నాయకత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి పులివెందుల నుండి అన్ని శాఖల ఉద్యోగుల, మహిళా ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మత్స్యశాఖ సంఘం అధ్యక్షులుగా బోలా శ్రీనివాసులు

**- సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తాను: బోలా శ్రీనివాసులు**

**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** కడప జిల్లా బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మ సాగర్‌కు సంబంధించిన వీంˆబ్రహ్మేంద్ర స్వామి మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షులుగా స్థానిక టిడిపి నాయకులు బోలా శ్రీనివాసులు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గురువారం స్థానిక మస్త్య శాఖ భవనంలో ఎన్నికల అధికారి ఆనంద్ కుమార్, ఎఫ్ డి ఓ బాలరాజు ఆధ్వర్యములో ఎన్నికలు నిర్వహించారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మస్త్య సహకార సంఘం లో 32 మంది సంఘ సభ్యులు ఉండగా, ఈ రోజు జరిగిన ఎన్నికలలో 26 మంది సంఘ సభ్యులు హాజరై అద్యక్షులుతో పాటు ఉపాధ్యక్షులుగా కందుకూరు సోమయ్యను, కార్యదర్శిగా గగ్గెర వెంకట రమణ, డైరెక్టర్లు గా తుపాకుల వెంకట రమణ, పిల్లి కొండయ్య, వజ్రాల బ్రహ్మయ్య, వజ్రాల వెంకట రమణ, బోలా శ్రీనివాసులు (ఆరెడ్డి పల్లె శ్రీను) లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భముగా సంఘం అధ్యక్షులు బోలా శ్రీనివాసులు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సంఘంలోని సభ్యులందరూ నన్ను సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్క సంఘ సభ్యునికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. నేటి నుండి మత్స్యకారుల అభివృద్ధి కోసం అలాగే ప్రభుత్వం నుండి వారికి వచ్చే ప్రతి సంక్షేమ పథకమును వారికి దక్కే విధంగా ముందుండి అందజేస్తామని ఆయన తెలిపారు. అలాగే మత్స్యకారుల కుటుంబాల అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం బ్రహ్మ సాగర్ లో చేప పిల్లలు వదిలేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140

## గంజాయి ముఠా గుట్టురట్టు..
# నలుగురు అరెస్ట్...!

**- 1.5 కిలోల గంజాయి స్వాధీనం.. 2 బైకులు, 3 స్మార్ట్‌ఫోన్లు సీజ్**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లాలో గంజాయి అక్రమ విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఆత్మకూరు పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేసి గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. కళ్యాణదుర్గం--అనంతపురం ఎన్ హెచ్ -544డిడి రహదారిలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు బైకులు, మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, వినియోగానికి పాల్పడితే ఎంతటి వారైనా కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు

# డీటీసీ శిక్షణార్థులకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం...!

**- క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణతో శారీరక దారుఢ్యానికి ప్రాధాన్యం**

**- క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించిన అదనపు ఎస్పీ నాగభూషణం**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో డీటీసీ శిక్షణార్థులకు మూడు రోజుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. డీటీసీ ప్రిన్సిపాల్, అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం క్రీడాజ్యోతి వెలిగించి, పోలీస్ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడోత్సవాల్లో 101 మంది ఎస్సీటీపీసీ శిక్షణార్థులు పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్‌లో 100, 200, 400, 800 మీటర్ల పరుగులు, 5కే రన్‌తో పాటు లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో వంటి పోటీలు నిర్వహించనున్నారు. అలాగే క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా తదితర క్రీడా కార్యక్రమాలు జరగనున్నాయి. శిక్షణార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు సమర్థవంతమైన పోలీసింగ్‌కు అవసరమైన శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరచడమే ఈ క్రీడోత్సవాల ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

# ఇన్‌స్పైర్-మనక్ జాతీయ స్థాయికి హుస్సేనాపురం విద్యార్థి ఎంపిక

**ప్యాపిలి- సూర్య వాస్తవం :** ప్యాపిలి మండలం హుస్సేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అంబటి హర్షవర్ధన్ రూపొందించిన వినూత్న శాస్త్రీయ ప్రాజెక్టు "డ్రైనేజీ ఓవరఫ్లో మంహోల్ మానిటరింగ్ ఏండ్ డిటెక్షన్ యూసింగ్ నోడంసు " ఇన్‌స్పైర్-మనక్ కార్యక్రమం ద్వారా జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు దివాకర్ మార్గదర్శకత్వంలో విద్యార్థి హర్షవర్ధన్ ఈ ప్రాజెక్టును రూపొందించారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో నీటి మట్టం పెరగడం, ఓవర్‌ఫ్లో వంటి సమస్యలను ముందుగానే గుర్తించి సంబంధిత వారికి సమాచారం అందించే విధంగా నోడంసు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి విద్యార్థి హర్షవర్ధన్‌ను అభినందించారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకుని, సమాజానికి ఉపయోగపడే వినూత్న ప్రాజెక్టులను రూపొందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హుస్సేనాపురం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (హోసన్నా ) ప్రతినిధులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి హర్షవర్ధన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అతని ప్రతిభకు మార్గదర్శకత్వం అందించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు దివాకర్ సర్‌ను కూడా ప్రశంసించారు. హర్షవర్ధన్ రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కావడం హుస్సైనాపురం పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మరియు హోసన్నా సభ్యులకు గర్వకారణమని వారు తెలిపారు. విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




# గత రెండేళ్లలో 13 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం...

**- రైల్వే వంతనకు 46 కోట్లు నిధులు మంజూరు..**
**- రాయదుర్గం అభివృద్ధే నా ఆశ.. నా ధ్యాస : ఎమ్మెల్యే కాలవ**



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాయదుర్గం పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం పట్టణంలో గురువారం 22వ వార్డులో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ... చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత రెండేళ్ల కాలంలో రూ.13 కోట్లను రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి ఖర్చు చేశామని వివరించారు. తాగునీటి సరఫరా కోసం అమృత్-2 పథకం కింద రూ.78 కోట్లతో విస్తరణ పనులు చేపట్టామని చెప్పారు. కనేకల్లు ఎస్ఎస్ ట్యాంక్ నుంచి రాయదుర్గం వరకు కొత్త పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోందని, దీనివల్ల భవిష్యత్తులో లీకేజీ సమస్యను పూర్తిగా అరికట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అర్ధాంతరంగా ఆగిపోయిన అనంతపురం-రాయదుర్గం రైల్వే వంతెన నిర్మాణానికి రూ.46 కోట్లు మంజూరు చేయించామని, టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు.

త్వరలోనే ఆ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో రూ.30 కోట్ల విలువైన రోడ్లు, పార్కుల అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని, ఇందుకు టెండర్లు కూడా ఆహ్వానించారని తెలిపారు. ఆ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. వీటితోపాటు ప్రత్యేకంగా మరో రూ.25 కోట్లు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పనులన్నీ పూర్తయితే రాయదుర్గం పట్టణంలో రూ.200 కోట్లకు తగ్గకుండా అభివృద్ధి కార్యక్రమాలు అయిదేళ్ల కాలంలో చేపట్టే అవకాశం ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇంత భారీ మొత్తంలో గతంలో ఎప్పుడూ రాయదుర్గం పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులు, పురపాలక శాఖ మంత్రి నారాయణ సహకారంతో రాయదుర్గానికి పెద్దఎత్తున నిధులు తీసుకురాగలుగుతున్నామని చెప్పారు. పేదల పక్కా గృహాల కోసం రాయదుర్గానికి ప్రత్యేకంగా అదనపు ఇళ్లు మంజూరు చేయించుకోగలుగుతున్నామన్నారు. వీటితోపాటు అర్ధాంతరంగా ఆగిపోయిన టిడ్కో బహుళ అంతస్తుల గృహ నిర్మాణ సముదాయాల పనులను కూడా తిరిగి ప్రారంభించామన్నారు.

రాయదుర్గం పట్టణంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ప్రగతికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఏ ఒక్క వార్డులోనైనా కూటమి అభ్యర్థులకు బదులుగా వైసీపీ అభ్యర్థులు గెలిస్తే ఆ వార్డులో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంటుందని గుర్తు చేశారు. తాను తీసుకొచ్చిన నిధులను కూడా గత పాలకవర్గం సక్రమంగా, సకాలంలో ఖర్చు చేయడానికి సహకరించలేదని విమర్శించారు. వైసీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారారని, వారికి నిధులు తీసుకురావడం, అభివృద్ధి చేయడం తెలియదన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నిధులను వినియోగంలోకి రానివ్వకుండా అడ్డుకోవడం మాత్రమే వారికి తెలుసని విమర్శించారు. అందువల్ల అభివృద్ధి నిరోధకులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వవద్దని రాయదుర్గం పట్టణ ప్రజలకు కాలవ విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో తనకు ఎవరికి, ఎప్పుడూ ఇవ్వనంత 16వేల మెజారిటీని రాయదుర్గం పట్టణ ప్రజలు అందించారని గుర్తు చేశారు. రాయదుర్గం పట్టణాన్ని మిగతా పట్టణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అభివృద్ధి చేయడమే తన ఆశ, ధ్యాస అని తెలిపారు. ప్రజలు ఇప్పటివరకు అందిస్తున్న సహకారాన్ని ఇదే విధంగా కొనసాగించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వినమ్రంగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, వార్డ్ ఇంచార్జి హరిజన ఆనంద్, మల్లికార్జున, నాయకులు టశీకశాల హనుమంతు, పోరాళ్ల పురుషోత్తం, బంగి శంకర్, వేణు, ధనర్జున, రామంజి, బుదురు తిప్పేస్వమి, పద్మజ, ప్రశాంతి, సంపత్ కుమారి, రావుత్ రాజశేఖర్, ఎల్లప్ప, లోకేష్, పైతోట అంజి, తదితరులు పాల్గొన్నారు.

# " స్టేషన్ మహోత్సవ్" ఉత్సవాలు నిర్వహించాలి

**- రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్**





**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాయదుర్గం రైల్వే స్టేషన్లో "హెరిటేజ్ స్టేషన్ మహోత్సవ్" ఉత్సవాలు నిర్వహించాలని రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్ కేంద్ర రైల్వే బోర్డు కు విజ్ఞప్తి చేసింది. గురువారం రాయదుర్గం లోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో అసోసియేషన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, " చరిత్ర వెలుగులో రాయదుర్గం" గ్రంథ రచయిత ఆర్ ఎస్ హులికుంటి మూర్తి, సంయుక్త కార్యదర్శి, నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ వినియోగదారుల సలహా మండలి పూర్వ సభ్యులు గుడేకోట శివకుమార్ విలేకరులతో మాట్లాడారు. కేంద్ర రైల్వే బోర్డు దేశవ్యాప్తంగా 100 ఏళ్ల క్రితం ఏర్పాటైన రైల్వే స్టేషన్లలో ఎంపిక చేసిన 109 స్టేషన్లో " స్టేషన్ మహోత్సవ్" ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బళ్లారి- రాయదుర్గం రైలు మార్గం కరువు నిధులతో నిర్మించబడి 1905 సంవత్సరం ఏప్రిల్ మొదటి తేదీన ప్రారంభించబడిందన్నారు. 2005 సంవత్సరానికి 100 సంవత్సరాలు పూర్తికాగా అప్పట్లోనే శతవార్షిక ఉత్సవాలు నిర్వహించాలని రైల్వే అధికారులను కోరినట్లు తెలిపారు. అప్పట్లో అలాంటి ఉత్సవాలు నిర్వహించకపోగా ఇప్పుడు దేశవ్యాప్తంగా వంద సంవత్సరాలు పైబడిన రైల్వే స్టేషన్లో స్టేషన్ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆ జాబితాలో రాయదుర్గం రైల్వే స్టేషన్ లేకపోవడం విచారకరం అన్నారు. లాభదాయకంగా లేదని కారణం తో 1980 సంవత్సర కాలంలో రైలు మార్గం తొలగించే ప్రయత్నాలు జరిగాయి అన్నారు. అనంతరం రాయదుర్గం నుండి చిక్క జాజ్నూరు వరకు కొత్త రైలు మార్గం ఏర్పాటు కాగా 2012 సంవత్సరంలో రాయదుర్గం నుండి తుమకూరుకు కొత్త రైలు మార్గం చేపట్టబడి ప్రస్తుతం నిర్మాణ దశలో ఉందన్నారు.

రాయదుర్గం గార్మెంట్ వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి కాగా చారిత్రక పర్యాటక ప్రదేశంగా కూడా ఉందన్నారు. రాయదుర్గం స్టేషన్లో స్టేషన్ మహోత్సవ ఉత్సవాలు నిర్వహించాలని, రాయదుర్గం - తుమకూరు రైలు మార్గం సకాలంలో పూర్తి చేయాలని, అమృత్ 2.0 లో భాగంగా స్టేషన్ను అభివృద్ధి చేయాలని కోరారు. రైల్వే స్టేషన్ లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఈ మార్గంలో ప్రయాణించు ఎక్స్ప్రెస్ రైలు రాయదుర్గం స్టేషన్లో ఆపాలని డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్లో పార్సిల్ బుకింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల రెడీమేడ్ గార్మెంట్స్ ఉత్పత్తుల రవాణాతో రైల్వే శాఖకు లక్షలాది రూపాయలు ఆదాయం చేకూరుతుందన్నారు. ఈ మేరకు తాము లేఖలను రైల్వే బోర్డు చైర్మన్ రైల్వే శాఖ మంత్రి నైరుతి రైల్వే జనరల్ మేనేజర్, హుబ్లీ డివిజనల్ రైల్వే మేనేజర్, అనంతపురం పార్లమెంటు సభ్యులకు లేఖలు పంపినట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు కి, రైల్వే స్టేషన్ మాస్టర్ కు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. రైల్వే శాఖ అధికారులు మంత్రులు ప్రజాప్రతినిధులు ఇందుకు సానుకూలంగా తగిన నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సమీక్ష






**పామిడి - సూర్య వాస్తవం:** స్థానిక పామిడి పట్టణ పరిధిలోని ఆదర్శ పాఠశాల నందు ప్రిన్సిపాల్ అరుణ ఆధ్వర్యంలో గురువారంన ఉపాధ్యాయ బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్నటువంటి ప్రగతిని వెలుగులోకి తీసి మరింత మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఈ ఏడాది 10వ. తరగతి పరీక్షలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విజ్ఞప్తి చేశారు అలాగే క్రీడల్లో కూడా రాణించాలని పేర్కొన్నారు. సమావేశంలో సోషల్ ఆడిట్ అధికారులు పాఠశాలను విజిట్ చేయడానికి హాజరైనారు. వారు క్షుణ్ణంగా రికార్డులు పరిశీలించి వారికి పాఠశాల బృందంతో పాటు మున్సిపల్ అరుణ సమస్యలలో భాగంగా పాఠశాలకు ప్రహరీ గోడని నిర్మించాలని, విద్యార్థులకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వారికీ విన్నవించుకున్నారు ఈ కార్యక్రమంలో సోషల్ వెరిఫికేషన్ అధికారులు, ఉపాధ్యాయ బృందం సిబ్బంది పాల్గొన్నారు.